సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



పల్లి రైతుల కన్నెర్ర
కనీస మద్దతు ధర కోసం పల్లి రైతులు మహబూబ్‌నగర్‌లో రోడ్డెక్కారు.
వివరాలు 8లో ▸



నేడు నిజరూప దర్శనం
అలంపూర్ జోగుళాంబ అమ్మవారు బుధవారం భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 36.6 /16.4

మధ్యాహ్నం ఎండ వేడిమి పెరుగుతుంది. ఉదయం, రాత్రి చలి తీవ్రత కాస్త తగ్గుతుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఏడుగురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి జిల్లాలో 19 మున్సిపాలిటీలు ఉండగా మూడేళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్న ఏడుగురు కమిషనర్లు బదిలీ అయ్యారు. కాగా, మహబూబ్‌నగర్ (స్పెషల్ గ్రేడ్) మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ రంగారెడ్డి జిల్లా మనికొండకు వెళ్తున్నారు. ఈయన స్థానంలో నిజామాబాద్‌లో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ)గా పనిచేస్తున్న మహేశ్వర్‌రెడ్డి పదోన్నతిపై వస్తున్నారు. భూత్పూర్ కమిషనర్ ఎండీ నూరుల్ నజీబ్ అమరచింతకు, జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ కమిషనర్ ఎస్.నిత్యానంద్ మేడ్చల్ జిల్లా మెప్మా కార్యాలయంలో ఏఓగా వెళ్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ కమిషనర్ ఎస్.రాజయ్య జడ్చర్ల మున్సిపాలిటీకి వస్తున్నారు. వనపర్తి జిల్లాలోని కొత్తకోట కమిషనర్ జి.శ్రీనివాస్ కేపీరంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లికి వెళ్తున్నారు. వనపర్తి మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి వికారాబాద్ జిల్లాలోని తాండూరుకు, నారాయణపేట జిల్లాలోని మక్తల్ మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్ వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌కు బదిలీ అయ్యారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నార్సింగి కమిషనర్ సురేందర్‌రెడ్డి భూత్పూర్‌కు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ నుంచి ఎస్.భాస్కర్‌రెడ్డి వనపర్తికి, నల్లగొండ జిల్లాలోని దేవరకొండ నుంచి వెంకటయ్య నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్‌కు, కరీంనగర్‌లో ఏఎంసీగా పనిచేస్తున్న బి.నరేష్‌బాబు నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. వీరంతా ఈ నెల 15లోగా విధుల్లో చేరాల్సి ఉంది.

గద్వాల మార్కెట్‌యార్డు సమాచారం

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు మంగళవారం 1,290 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్టంగా రూ. 6,890, కనిష్టంగా రూ.3,200, సరాసరి రూ.6,130 ధరలు పలికాయి. 6 క్వింటాళ్ల ఆముదం రాగా.. గరిష్టంగా రూ.5,512, కనిష్టంగా రూ.5,420, సరాసరి రూ.5,420 ధరలు వచ్చాయి. 50 క్వింటాళ్ల కంది రాగా.. గరిష్టంగా రూ.10,040, కనిష్టంగా రూ.9,720, సరాసరి రూ.10,030 ధరలు పలికాయి.

‘ఈ చిత్రంలో కనిపిస్తున్న నిర్మాణం సుంకులమ్మమెట్టు కాలనీలోని మహిళలకు సామూహిక మరుగుదొడ్ల కోసం కేటాయించిన స్థలం. అప్పట్లో సుమారు పావుఎకరాకి పైగా స్థలాన్ని కేటాయించినట్లు సంబంధిత కాలనీవాసులు చెబుతుండగా.. గత ప్రభుత్వం సామూహిక మరుగుదొడ్ల పథకాన్ని పూర్తిగా నిషేధించడంతో మున్సిపల్ స్థలం కాస్త ఖాళీగా ఉండిపోయింది. అయితే ఇదే అదునుగా ప్రైవేటు వైద్యరంగంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి తనకున్న పలుకుబడితో ప్రస్తుతం రూ.కోట్ల విలువైన స్థలాన్ని కబ్జాపెట్టి అందులో నిర్మాణం చేపట్టారు. దీనిపై గతంలో సంబంధిత కాలనీవాసులు ఆందోళన చేపట్టినప్పటికీ సదరు కబ్జాదారుడు తనకున్న పలుకుబడితో కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేసి అందరి నోర్లు మూయించాడు. కబ్జా పెట్టిన స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని అద్దెకిచ్చాడు.’



సుంకులమ్మమెట్టు కాలనీలో కబ్జా చేసిన సామూహిక మరుగుదొడ్డి స్థలంలో వెలిసిన నిర్మాణం

కబ్జాల పరంపర

గద్వాలలో ఇష్టానురీతిలో కొనసాగుతున్న ఆక్రమణలు



గద్వాలలో కబ్జారాయుళ్లు పెట్రేగిపోతున్నారు. ఇప్పటికే పలుచోట్ల అక్రమార్కులు ఎంతో విలువైన పదిశాతం ప్రభుత్వ స్థలాలను కబ్జాకు పాల్పడి దర్జాగా భవంతులు నిర్మించుకున్నారు. మేమేమి తక్కువ కాదంటూ మరికొందరు ఏకంగా సామూహిక మరుగుదొడ్లకు కేటాయించిన స్థలాలను, మున్సిపల్ రోడ్లను సైతం ఆక్రమించుకుని కబ్జాకు పాల్పడి దర్జాగా నిర్మాణాలు చేపడుతుండటం విశేషం. దీనిపై సంబంధిత అధికారులు నోటీసులకే పరిమితమవుతూ మిన్నకుండి పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. గద్వాలలో కొనసాగుతున్న ఆక్రమణల పరంపరపై ‘సాక్షి’ కథనం.

– గద్వాల రూరల్

- మున్సిపల్ రోడ్లు, సామూహిక మరుగుదొడ్లు సైతం
- రాజకీయ ఒత్తిళ్లతో నోటీసులకే పరిమితమవుతున్న అధికారులు

సుమారు 35ఏళ్ల కిందట అప్పటి మున్సిపల్ చైర్మన్ డీకే భరత్‌సింహారెడ్డి నేతృత్వంలో గద్వాల మున్సిపాలిటీలో మహిళలకు సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం సుమారు 8 వార్డులకు పైగా ప్రభుత్వ స్థలాలను కేటాయించారు. ఈ మరుగుదొడ్ల కారణంగా వివిధ రకాల అంటువాధ్యులు వ్యాప్తిచెందడం, సంబంధిత కాలనీలో కాలనీవాసులు అనారోగ్యంపాలు కావడంతో సామూహిక మరుగుదొడ్ల పథకాన్ని తరువాతి ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించి స్థలాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలాలను పరిరక్షించేలా ఎలాంటి కంచెలు, బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడే కబ్జారాయుళ్లకు అవకాశంగా మారింది. ప్రస్తుతం గద్వాల పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందడం, దానికనుగుణంగానే స్థలాల ధరలు రూ.కోట్లలో పలకడంతో కబ్జారాయుళ్లు ఖాళీగా ఉన్న సామూహిక మరుగుదొడ్లపై కన్నుపడింది. తమకున్న పలుకుబడితో ఆ స్థలాలను కబ్జాపెట్టి తరువాత అక్కడ నిర్మాణాలు చేపట్టారు. అదేవిధంగా కుంటవీధి కాలనీలో సామూహిక మరుగుదొడ్ల స్థలంలో సగానికిపైగా కబ్జాకు గురికాగా మిగిలిన స్థలంలో మున్సిపల్ అధికారులు పార్కును ఏర్పాటు చేశారు.

ఎన్ని ఉన్నాయో లెక్క తెలియదు..

గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఎన్నివార్డుల్లో సామూహిక మరుగుదొడ్ల కోసం స్థలాలను కేటాయించారనే సమాచారం, అందుకు సంబంధించిన రికార్డు అధికారుల వద్ద అందుబాటులో లేదు. ఈ కారణంగానే కబ్జారాయుళ్లు దర్జాగా కబ్జాపెట్టేస్తూ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు.

రోడ్డును సైతం...

30వ వార్డులో ఓ వ్యక్తి తనకున్న స్థలాన్ని కాదని మున్సిపల్ రోడ్డును ఆక్రమించి ఏకంగా రెండు అంతస్తుల దుకాణాల నిర్మాణం చేపట్టాడు. దీనిపై గతంలో ఫిర్యాదులు వెళ్లగా స్పందించిన మున్సిపల్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లు రావడంతో నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలున్నాయి. లైబ్రెరికి వందమీటర్ల దూరంలో కబ్జారాయుళ్లు రోడ్డును ఆక్రమించుకున్నారు.

నోటీసులు ఇచ్చాం..

సుంకులమ్మ మెట్టు కాలనీలో మున్సిపల్ **రోడ్డు కొంత భాగా**న్ని ఆక్రమించి దుకాణాల **నిర్మాణం చేస్తున్నవా**రికి గతంలోనే నోటీసులు **ఇచ్చాం. పూర్తిస్థా**యిలో విచారణ చేపట్టిన **చర్యలు తీసుకుంటా**ం.

– కళ్యాణచక్రవర్తి, టీపీఓ, గద్వాల మున్సిపాలిటీ

చర్యలు తీసుకుంటాం..

గతంలో గద్వాల పట్టణంలో సామూహిక **మరుగుదొడ్ల కోసం** స్థలాలను కేటాయించాం. **ఈ పథకం పూర్తిగా** రద్దు చేయడంతో ఆ **స్థలాలు ఖాళీగా** ఉన్నాయి. మీరు చెబుతు**న్నట్లు కబ్జాకు గురైన** సామూహిక మరుగుదొడ్డి **స్థలాన్ని క్షేత్రస్థాయి**లో పరిశీలించి వాస్తవాలు **తెలుసుకుని అవసర**మైన చర్యలు చేపడుతాం.

– నర్సింహా, కమిషనర్ గద్వాల మున్సిపాలిటీ

నోటీసులకే పరిమితం..

గద్వాల పట్టణంలో పెద్దఎత్తున పదిశాతం స్థలాలు, సామూహిక మరుగుదొడ్ల స్థలాలు కబ్జాకు గురవుతుంటే అడ్డుకుని వాటిని కాపాడాల్సిన సంబంధిత అధికారులు నోటీసులు ఇచ్చి మిన్నకుండి పోతున్నారు.

ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీలు



స్ట్రాంగ్‌రూంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి మొదటి స్థాయి తనిఖీలు నిర్వహించినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. మంగళవారం పీజేపీ క్యాంపులోని స్ట్రాంగ్‌రూంలో ఈవీఎం, వీవీప్యాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాల ఆధ్వర్యంలో 826 ఈవీఎం బ్యాలెట్ యూ నిట్లు, 769 కంట్రోల్ యూనిట్లు, 930 వీవీ ప్యాట్ల తనిఖీల ప్రక్రియ నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ అనంతరం గుర్తింపు పొందిన వివిధ రాజకీ య పార్టీల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా ల పనితీరును ప్రయోగాత్మకంగా ర్యాండం విధానంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నామని చెప్పారు.

రాజకీయపార్టీల ప్రతినిధులు..

ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి తనిఖీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఈవీఎంను గోదాములో భద్రపర్చామని అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ అన్నారు. మొదటిస్థాయి తనిఖీల ప్రక్రియ అనంతరం వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై మాక్‌పోల్ నిర్వహించారు. అనంతరం వాటికి సీల్ చేసి స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నరేష్, సిబ్బంది, వివిధ రాజకీయపార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో ఆటలు కీలకం

పోటీలను ప్రారంభించిన ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం: ఆరోగ్య విషయంలో ఆటలు ఎంతో కీలకంగా ఉంటాయని ఎస్పీ రితిరాజ్ అన్నారు. మంగళవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసులో భాగంగా క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామ, వార్డు, రాష్ట్ర స్థాయి వరకు మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పోలీసుశాఖ చర్యలు తీసుకుందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం.. అంతటికే పరిమితంగాక వారిని జాతీయ, అంతర్జాతీయ వేదికపై నిలిపేందుకు ఈ క్రీడాలను క్రీడా యజ్ఞంగా నిర్వహించామన్నారు. పోటీలో వ్యాయామ ఆవశ్యకత, ఆరోగ్యపరంగా చైతన్యం కలుగుతుందన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మూడు రోజుల పాటు క్రీడాలు నిర్వహిస్తున్నామని, పోలీసు, రెవెన్యూ, పబ్లిక్, మీడియా విభాగంలోని పలు టీంలు పాల్గొనడం మంచి తరుణమన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రభాతభేరి చేపట్టారు. ముందుగా మల్దకల్, అలంపూర్ జట్ల మధ్య వాలీబాల్ పోటీలను ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది నరేందర్ తదితరులు ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ రితిరాజ్

అవాంతరాలను అధిగమించి లక్ష్యాన్ని చేరాలి

గట్టు: విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వాటిని అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవాలని ఎస్పీ రితిరాజ్ సూచించారు. మంగళవారం బోయలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 335 మంది విద్యార్థులకు వివేక్ ఎడ్యుకేషనల్ ట్రస్టు(భీమన్న) ఆధ్వర్యంలో అట్లాస్, ప్యాడ్స్, డిక్షనరీస్, జనరల్‌నాలెడ్జ్ పుస్తకాలు, జామెట్రిబాక్స్, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. బాలికలు విద్యను మధ్యలోనే నిలిపేయవద్దన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రెఫరీగా జిల్లా వాసి ఎంపిక



సయ్యద్ హైదర్ పాష(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ హైదర్ పాష జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ రెఫరీగా ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన ఏఎఫ్‌ఐ సెమినార్, ఎఫ్‌ఎస్‌టీఓ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో 59వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ రెఫరీగా ఎన్నికయ్యారు. ఈ నెల 14 నుంచి 19 వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ క్రీడలకు రెఫరీగా పనిచేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బీచుపల్లి పదో పటాలంలోని సాయిధ చైతన్య పాఠశాలలో ఆయన వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

విద్యార్థుల మేధోశక్తిని పెంపొందించాలి



బహుమతి అందజేస్తున్న అడిషినల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్

గద్వాల: ఆంగ్లభాషలో ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు స్పెల్లింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ‘ఎల్టా’ నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామ, స్కిట్ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి స్పందన లభించింది. మంగళవారం స్థానిక బాలభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం(ఎల్టా) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యంపై జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతులుగా నిలిచిన విద్యార్థులతో పాటు ఆంగ్ల భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆయా విభాగాల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి అడిషినల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్టా అధ్యక్షుడు మైకెల్, ప్రధాన కార్యదర్శి సుమలత, కోశాధికారి వెంకట్రాములు, న్యాయనిర్ణేతలు జయప్రద, యల్లప్ప, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 13 మంది ఎంపిక

గద్వాల: జిల్లాకు చెందిన 13 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. గుజరాత్‌లో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు జరిగే 19వ జాతీయ అంతర్రాష్ట్ర జూనియర్ మీట్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులు మంగళవారం గుజరాత్‌కు బయలుదేరారు. వీరికి డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీఎస్ ఆనంద్, అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు బీసన్న, సతీష్, నగేష్‌బాబు, ఆంజనేయులు, అశోక్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

క్లుప్తంగా

చేపల వల కాళ్లకు చుట్టుకొని వ్యక్తి మృతి


మృతిచెందిన నాగరాజు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు బ్యాక్ వాటర్‌లో ప్రమాదవశాత్తు మంగళవారం ఓ వ్యక్తి మునిగి మృతిచెందాడు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్ పట్టణానికి చెందిన వాకిటి నాగరాజు(35) చేపల వ్యాపారం చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. ఉదయం కొత్తపల్లి బ్రిడ్జి వద్ద రామన్‌పాడు బ్యాక్ వాటర్‌లో చేపలు పడుతుండగా.. ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు తట్టుకొని నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి ఆత్మకూరుకు తరలించామని చెప్పారు. తల్లి వాకిటి అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

- పరిశ్రమలో పనిచేస్తూ గాయపడ్డ వైనం

బాలానగర్: ఓ కార్మికుడు చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాజీ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన కార్మికుడు మున్నా (20) వారం రోజుల క్రితం పెద్దాయపల్లి శివారులోని ఓ పరిశ్రమలో చేరాడు. మిషన్‌వద్ద పనిచేసే సమయంలో ఈ నెల 11న గాయపడ్డాడు. ఘటనలో అతడి తలకు బలంగా గాయాలు అయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియాకు అతడిని తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై మున్నా బంధువు సఫర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

మద్దూరు: ఓ మహిళ జీవితంపై విరక్తితో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్‌లాల్ కథనం మేరకు.. మద్దూరు చెందిన బొబ్బిలి మంగమ్మ(45) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. భర్త శ్యాముల్, కుమారుడు వ్యాపార నిమిత్తం గుర్మిట్‌కల్ వెళ్లగా.. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కాగా ఆమె భర్త శ్యాముల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చిరుత కోసం బోను ఏర్పాటు




ఖిల్లాఘనపురం: మండలంలో చిరుత తిరుగుతున్న నేపథ్యంలో గ్రామ శివారులోని దేవుని గుట్ట వద్ద దానిని పట్టుకునేందుకు మంగళవారం ఫారెస్ట్ అధికారులు బోను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఖిల్లాగట్టు వైపు నుంచి ఆకుల సత్యనారాయణ పొలం వద్ద వనపర్తి, ఖిల్లాఘనపురం ప్రధాన రోడ్డు దాటుతునచిరుత గ్రామస్తులకు కనిపించడంతో అధికారులు స్పందించారు. ఫారెస్టు రేంజ్ అధికారి పి. మంజుల సిబ్బందితో కలిసి చిరుత వెళ్లిన దారిలో బోను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోను ఏర్పాటు చేసిన పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని సూచించారు. ఫారెస్ట్ బీట్ అధికారి వంశీ, సిబ్బంది అంజనేయులు, చంద్రయ్య, చెన్నయ్య తదితరులు ఉన్నారు. కాగా ఈ నెల 3న మేకను ఎత్తుకెళ్లిన చిరుత ఎర్ర కుంట వద్ద కనిపించడంతో అక్కడ బోను ఏర్పాటు చేసినా ఫలితం కనిపించలేదు.

‘ప్రేమ’ ముసుగు కావొద్దు

ప్రేమ అనేది రెండు మనసుల మధ్యన ఏర్పడే విడదీయరాని బంధం వేస్తుంది. ఇరువురిదీ ఒకేదారి అయినప్పుడే ఈ బంధం సాఫీగా సాగుతుంది. పెళ్లి అనే సరికొత్త జీవనం వైపు అడుగులు వేయించి భవిష్యత్ పునాదులకు బీజం వేస్తోంది. కానీ, ఇలాంటి ప్రేమ ప్రస్తుత రోజుల్లో తాత్కాలికమే అయ్యింది. తెలిసీ తెలియని వయస్సులో కొందరు ఆకర్షణకు లోనై.. మత్తులో మునిగి తేలుతున్నారు. మరికొందరు చిన్న వయసులోనే ప్రేమ పేరిట జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ప్రేమ ఎంతో బలమైందన్నది ఎంత నిజమో.. మనస్ఫూర్తిగా ప్రేమించి వివాహం చేసుకున్న వారి జీవితం అంతే బలంగా.. సాఫీగా సాగుతుందన్నది అంతే నిజం. ఈ నేపథ్యంలో బుధవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రేమ వివాహాలు, ప్రేమ ముసుగులో జరుగుతున్న దారుణాలపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

– మహబూబ్‌నగర్ క్రైం



- ప్రేమ పేరుతో యువత పెడదారి
- పెద్దలు అంగీకరించకపోతే ఆత్మహత్యలు
- జిల్లాలో అమ్మాయిలు, బాలికలపై పెరుగుతున్న దాడులు

ఒప్పుకోకపోతే దాడులు

ప్రేమ పేరుతో యువతులపై దాడులు, దారుణాలు, దాష్టీకాలు చేస్తున్న కీచకులు సైతం లేకపోలేదు. తన ప్రేమను అంగీకరించలేదన్న కారణంతో కాపుకాచి మరీ దారుణాలకు పాల్పడుతున్నారు. ఇటీవల జడ్చర్లలో ఈ తరహా సంఘటన చోటుచేసుకోవటం అందరికీ తెలిసిందే. తన ప్రేమను అంగీకరించలేదన్న కారణంతో ఓ యువకుడు బండరాయితో దాడి చేశాడు. కొన్నిచోట్ల పెద్దలు పెళ్లికి అంగీకరించట్లేదనే కారణంతో ప్రేమ పేరుతో జంటలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

మిడిమిడి జ్ఞానంతో ప్రేమకు దగ్గరవుతున్న కొందరు పెళ్లి విషయం వచ్చేసరికి ఇల్లు విడిచి వెళ్తున్నారు. ఇలాంటి కేసులు ఏటా సుమారు 200 వరకు ఉంటున్నాయి. వీరిలో బాలికలే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. చిన్నతనంలో కుటుంబ నేపథ్యం, సామాజిక స్థితిగతులు, ఆర్థికాంశాలు కూడా దోహదపడుతున్నాయి. గతేడాది జిల్లాలో 464పైగా అదృశ్య కేసులు నమోదయ్యాయి. డబ్బు ఉన్నా.. లేకపోయినా అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమించుకోవడానికి.. కలిసి జీవించడానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీరిలో కొంతమంది తల్లిదండ్రులను ఒప్పిస్తే.. మరికొందరు ఎదిరించి పెళ్లి చేసుకుంటున్నారు.

మైనర్లతో వ్యవహారం నేరమే

వివాహానికి చట్టబద్ధంగా కనీస వయస్సు తప్పనిసరి. ఇందుకోసం ప్రభుత్వం నుంచి జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని ఆధారంగా చూపాల్సి ఉంటుంది. చట్టపరంగా యువతికి 18 ఏళ్లు, యువకునికి 21 ఏళ్లు నిండి ఉండాలి. కానీ, ఏ మాత్రం అవగాహన లేకుండా కేవలం ఆకర్షణకు లోనై ప్రస్తుతం చాలామంది పెళ్లి చేసుకుంటున్నారు. ఇదే సమయంలో వయస్సు గురించి పెద్దగా పట్టించుకోవట్లేదు. అయితే యువతుల కనీస వయస్సు 18 ఏళ్లు నిండని పక్షంలో వారిని మైనర్లుగా భావించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో మైనర్లను వివాహం చేసుకోవడం, పెద్దల అనుమతి లేకుండా తీసుకెళ్లడం చట్టరీత్యా నేరం. ఇలాంటి కేసుల్లో యువతి సమ్మతి లేకుంటే యువకుడిపై అత్యాచారం, అపహరణ కేసులు కూడా నమోదు చేస్తారు. ఒకవేళ యువతి సమ్మతి ఉంటే కనీస వయస్సు పూర్తయ్యే వరకు ఆమె ఇష్టానుసారం ప్రభుత్వ సంరక్షణ కేంద్రంలో ఉంచుతారు.

నాలుగేళ్లుగా జిల్లాలో చోటుచేసుకున్న అఘాయిత్యాలు ఇలా..

ఏడాది	పోక్సో	అత్యాచారాలు	354ఐపీసీ	ఇతర కేసులు
2020	77	66	92	103
2021	122	96	96	127
2022	127	109	103	128
2023	110	95	127	131

మూడేళ్లలో షీటీం నమోదు చేసిన కేసులు, కౌన్సెలింగ్ వివరాలు

ఏడాది	ఫిర్యాదులు	కౌన్సెలింగ్స్	ఎఫ్ఐఆర్‌లు
2021	47	37	2
2022	64	48	8
2023	73	42	17

- మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌కు గతేడాది మొత్తం 1,175 ఫిర్యాదులు రాగా.. వీటిలో 1,050 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే 118 కేసులు నమోదు చేశారు.

విడిపోతున్న జంటలు అధికమే

తెలిసీ తెలియని వయసులో ప్రేమ వివాహాలు చేసుకుంటున్న జంటల్లో చాలామంది విడిపోతున్నారు. పట్టణ ప్రాంతాలకు చదువుకోవడానికి వస్తున్న అమ్మాయిలు ఆటోడ్రైవర్లు, ఇతర పోకిరీల ఉచ్చులో పడి మోసపోతున్నారు. అయితే ప్రేమ పెళ్లి చేసుకుంటున్న వారిలో మనస్పర్థలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రేమించుకుంటున్న అర్థం చేసుకునే మనస్సు.. పెళ్లి చేసుకున్నాక విబేధిస్తోంది. దీంతో ఇద్దరి మధ్య దూరం ఏర్పడి, విడాకులకు దారితీస్తోంది. ఇలా ఏటా పదుల సంఖ్యలోనే జంటలు విడిపోతున్న దాఖలాలున్నాయి. ప్రేమ వివాహాలు చేసుకున్న వారు, పెద్దలను ఒప్పించి ఒక్కటైన జంటలు సైతం చిన్నపాటి కారణాలకే విడిపోతుండటం ఆందోళన కలిగించే అంశం.

షీటీంకు ఫిర్యాదు చేయాలి..



అమ్మాయిలు, మహిళలు ఎవరైనా కొత్త వారిని నమ్మరాదు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే 100 లేదా షీటీంకు ఫిర్యాదు చేయాలి. చదువు పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడిన తర్వాత ప్రేమ గురించి ఆలోచించాలి. చిన్న వయస్సులో చదువులు నాశనం చేసుకుని అమ్మాయిల వెంట తిరగడం సరికాదు. మైనర్ అని తెలిసి కూడా అమ్మాయిని తీసుకువెళ్లడం, పెళ్లి చేసుకోవడం వంటి చేస్తే అత్యాచారం, అపహరణ, పోక్సో కేసులు నమోదు చేస్తాం. ఇటీవల సోషల్ మీడియా, ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్ వంటి వాటివల్ల యుక్త వయస్సులో పిల్లలు దారితప్పుతున్నారు. ఇలాంటి పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తుండాలి.

– స్వాతి, ఎస్‌ఐ, మహిళా పోలీస్‌స్టేషన్

ప్రకృతి ప్రేమ ‘చిహ్నం’



ప్రకృతి ఎన్నో వింతలు.. విచిత్రాలకు ఆలవాలమై ఉంటుంది. కాస్త పరికించి చూస్తే చాలు.. ప్రతి ఒక్క దృశ్యం ఒక అద్భుత కావ్యంలా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రేమకు ప్రతిరూపమైన హృదయ చిహ్నం ప్రకృతితో ఏర్పడి ఆ ‘రాయి’కి మరింత వన్నె తెచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఖానాపూర్–కారుకొండ మధ్య అడవిలో ఓ రాయి గుండెను పోలిన ఆకృతితో విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రేమికుల దినోత్సవం నేపథ్యంలో రాతి‘గుండె’ను ‘సాక్షి’ కెమెరా క్లిక్‌మనిపించింది.

– నవాబ్‌పేట

పెళ్లి తర్వాత పెద్దలను ఒప్పించాం..



కొల్లాపూర్: పెంట్లవెల్లి మండలం కొండూరుకు చెందిన కేతూరి ధర్మతేజ, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలుకు చెందిన బిజ్జ ఉమామహేశ్వరి 2017లో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరి కులాలు వేరు కావడంతో వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో మిత్రుల సహకారంతో ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. తర్వాత ఇరువురు తమ కుటుంబీలను ఒప్పించారు. వీరికి అభ్యుధయశ్రీ,, నూతన్ ఉత్తేజ్ సంతానం. అంతరాలు లేని నవ సమాజ నిర్మాణానికి కులాంతర వివాహాలు దోహదం చేస్తాయని వారు చెబుతున్నారు. ప్రేమ అనేది ఇరువురి అభిప్రాయాల కలయిక అని.. కుల పట్టింపులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

పదేళ్లు ప్రేమించి.. పెద్దలను ఒప్పించి...



నవాబుపేట: ఓ శుభకార్యక్రమంలో చూసి.. వన్‌సైడ్ లవ్‌గా ప్రారంభమై పదేళ్లు ప్రేమించుకొని చివరకు పెద్దలను ఒప్పించి, మెప్పించి పెళ్లి చేసుకుంది ఓ జంట. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వారు తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన రాజేష్ తాండూర్‌కు చెందిన సంగీతను బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభకార్యంలో చూసి ప్రేమించాడు. 2003లో ఇద్దరి మనుసులో ప్రేమ చిగురించినా.. ఎంబీబీఎస్ చదవాలన్న లక్ష్యం, అందుకు ప్రేమ అడ్డుగా వస్తుందని సంగీత సుమారు మూడేళ్ల పాటు మౌనంగా ఉండిపోయింది. చివరకు చైనాలో ఎంబీబీఎస్ చదివేందుకు వెళ్లగా.. రాజేష్ తన ప్రేమను లేఖ రూపంలో రాసి సంగీతకు పంపించాడు. కొంతకాలం తర్వాత ఆమె ఓకే చెప్పి చదువు పూర్తి చేసుకొని ఇండియాకు వచ్చింది. అయినా పెళ్లికి పెద్దలను ఒప్పించడం చాలా గగనమైంది. చివరకు 2013లో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వారు ఇద్దరు పిల్లలతో హాయిగా జీవనం సాగిస్తున్నారు.


మహబూబ్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న వేరుశనగ రైతులు

పల్లి రైతుల కన్నెర్ర

- ధర తగ్గించడంపై ఆగ్రహం.. కార్యాలయ ఫర్నిచర్ ధ్వంసం
- అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ.. జాతీయ రహదారిపై బైఠాయింపు
- కలెక్టర్ రావాలంటూ నినాదాలు
- స్తంభించిన ట్రాఫిక్.. వాహనాలను దారి మళ్లించిన పోలీసులు


మార్కెట్ కార్యాలయంలో ధ్వంసమైన డోర్ అద్దాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): వేరుశనగకు కనీస మద్దతు ధర లేక.. పంట కోసం పెట్టిన పెట్టుబడి సైతం చేతికొచ్చే పరిస్థితి లేక దిక్కుతోచని స్థితిలో రైతులు రోడ్డెక్కారు. కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన చేపట్టారు. మంగళవారం మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు రైతులు పెద్దఎత్తున వేరుశనగ పంటను విక్రయాల కోసం తీసుకువచ్చారు. అయితే మార్కెట్‌లో పంటకు మద్దతు ధర లభించకపోవడాన్ని గమనించిన రైతులు మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత ఒక్కసారిగా మార్కెట్ కార్యాలయంలోకి వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగారు. వేరుశనగకు కనీస మద్దతు ధర కల్పించడంలో అధికారులు విఫలమవడంతో రైతులు మార్కెట్ కార్యాలయంలోని కుర్చీలు, టేబుళ్లు, కిటికీలకు ఉన్న అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం మార్కెట్‌లో విక్రయాలను బంద్ చేసి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని.. 167 జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఆరుగాలం శ్రమించి వేరుశనగను మార్కెట్‌కు తీసుకువస్తే అధికారులు పంటకు కనీస మద్దతు ధర కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వచ్చి తమ డిమాండ్ తీర్చాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి.. భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అయితే పరిస్థితి చేయిదాటిపోతుందని గ్రహించిన అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ పోలీసులతో కలిసి రాస్తారోకో విరమించాలని రైతులకు సూచించారు. మార్కెట్‌కు వెళ్లి అధికారులతో చర్చిద్దామని చెప్పడంతో అందుకు రైతులు సమ్మతించి తిరిగి బయలుదేరారు. మార్కెట్ యార్డులో విలేకరులతో కొందరు రైతులు మాట్లాడుతూ మార్కెట్ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్స్ కుమ్మక్కై అతి తక్కువ ధరకు నిర్ణయించారని, వేరుశనగ పంటను కొనుగోలు చేసే ట్రేడర్స్ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. మార్కెట్‌కు తీసుకువచ్చిన వేరుశనగ కుప్పలో నుంచి శాంపిల్స్ సేకరించి అవుటాన్ తీయాల్సి ఉండగా ట్రేడర్స్ స్వలాభం కోసం గుమాస్తాలను పంపించి నామమాత్రంగా పరిశీలించి కేవలం రూ.4,500–5,500లోపు ధర ఇచ్చి రైతుల కడుపు కొడుతున్నారని వాపోయారు. ఇదిలా ఉండగా మార్కెట్ అధికారులు రైతులతో రాత్రి పొద్దుపోయే వరకు మద్దతు ధర విషయమై చర్చించినా కొలిక్కి రాలేదు.



వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

పైకప్పు పెచ్చులూడి.. టీచింగ్ ప్రాక్టీస్ విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న మంజుల

అచ్చంపేట రూరల్: టీచింగ్ ప్రాక్టీస్‌కు వచ్చిన విద్యార్థిని తలపై పాఠశాలలోని ఓ గది పైకప్పు పెచ్చులూడి పడటంతో గాయాలైన ఘటన మంగళవారం అచ్చంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అచ్చంపేట ప్రగతి కళాశాలలో డీఈఎల్‌ఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మంజుల, మరో ముగ్గురు విద్యార్థులు పట్టణంలోని ఏయూపీఎస్‌లో టీచింగ్ ప్రాక్టీసు చేస్తున్నారు. మంగళవారం తరగతిగదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఖాళీ సమయంలో పాఠశాలలోని ఓ గది వైపు వెళ్లింది. అదే సమయంలో పైకప్పు పెచ్చులూడి తలపై పడటంతో గాయమైంది. వెంటనే ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గాయమైన చోట కుట్లు వేసి మెరుగైన వైద్యం, స్కానింగ్ కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం రామచంద్రయ్యను వివరణ కోరగా.. పాఠాలు బోధించిన అనంతరం స్టాఫ్‌రూంలో కూర్చోవాలని సూచించామని, స్టోర్‌రూం వైపు వెళ్లడంతో పెచ్చులూడి విద్యార్థిని తలపై పడ్డాయని తెలిపారు. వెంటనే ఆస్పత్రిలో చికిత్స చేయించామని వివరించారు.

పశుగ్రాసం దగ్ధం

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతులు వెంకటనాయుడు, రంగమ్మ స్థానికంగా ఉన్న పాత సినిమా థియేటర్ సమీపంలో వరి గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఫైరింజన్ గ్రామానికి చేరుకొనే లోగా రెండు గడ్డి వాములతో పాటు ఎద్దులబండి పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ‘రిషి’ ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈఓ, కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని రిషి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు సాకేత్‌సింగ్ 99.60 పర్సంటైల్, వినయ్‌రెడ్డి 98.67 వంశీచంద్ర 97.54తో అత్యధిక పర్సంటైల్‌ను సాధించారు. వీరితో పాటు 16 మంది విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్లు కళాశాల అకాడమిక్ డైరెక్టర్ చంద్రకళా వెంకట్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీఐఈఓ శ్రీధర్‌సుమన్ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. వెనుకబడిన పాలమూరు జిల్లా విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉన్న ఇంజినీరింగ్ విద్యను చేరువ చేసిన ఘనత రిషికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అడ్వయిజర్ వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విజయఢంకా మోగించిన ‘ప్రతిభ’


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ఈ మేరకు కళాశాలకు చెందిన విద్యార్థులు కార్తిక్ సారంగ్ 99.83, గణేష్ 98.63, అనిరుధ్‌గౌడ్ 98.22, సాయిఈశ్వర్ 96.20, ఉమేష్‌చంద్ర 95.05, మోనిక 94.78, సాయిప్రభాస్ 94.65, శ్రీవల్లి 94.47, నాగసాయిచేతన్ 93.97, ఐశ్వర్య 93.34, నమిత 93.40, అనిల్‌నాయక్ 92.97, పర్ణిక 92.92, శ్రీకాంత్ 92.32, నవ్యశ్రీ 92.21 పర్సంటైల్ మార్కులు సాధించారు. అంతేకాకుండా 45 మంది విద్యార్థులు 80 పర్సంటైల్‌కు పైగా మార్కులు సాధించారు. వారిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తాచాటిన వాగ్దేవీ విద్యార్థులు


ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వెంకట్‌రెడ్డి, తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు అన్విత 99.13 పర్సంటైల్, కీర్తన 95.92 పర్సంటైల్‌ను సాధించారు. 90 పర్సంటైల్‌కు పైగా ఐశ్వర్య, కస్తూరి, సాయి భరత్, రాధిక, అన్వితలు సాధించి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతూనే జాతీయ స్థాయి జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఉత్తమ పర్సంటైల్ సాధించడం గొప్ప విషయమని, భవిష్యత్‌లో విద్యార్థులు మరింత కష్టపడి చదివి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఎల్లో మీడియా చానల్స్‌ను ప్రతివాదులుగా చేర్చిన హైకోర్టు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించడంతోపాటు కేసు కొట్టేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తీర్పునిచ్చినందుకు ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులతోపాటు ఏసీబీ కోర్టు జడ్జిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగ్‌లు, కామెంట్లు పెట్టడంపై దాఖలైన క్రిమినల్ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో ఎల్లో మీడియా చానల్స్ టీవీ 5, మహాన్యూస్, మైరా మీడియా సంస్థలను హైకోర్టు ప్రతివాదులుగా చేర్చింది. హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిపై యూట్యూబ్‌లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను తొలగించాలని గూగుల్ ఎల్‌ఎల్‌సీని ఆదేశించింది. కాగా.. తమ మాధ్యమాల్లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను ఇప్పటికే తొలగించామని ప్రముఖ ఆన్‌లైన్ సామాజిక మాధ్యమ సంస్థలైన ఎక్స్, ఫేస్‌బుక్ హైకోర్టుకు నివేదించాయి. ఈ వివరాలను హైకోర్టు రికార్డ్ చేసింది. ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో పలువురికి ఇంకా నోటీసులు అందచేయాల్సి ఉందని, అందువల్ల నోటీసులు అందజేసేందుకు మరికొంత గడువు ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టును అభ్యర్థించారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను మార్చి 26కి వాయిదా వేసింది.

అటు ఆటలు ఇటు ఆరోగ్యం

- మట్టిలో మాణిక్యాల్ని వెలికితీద్దాం
- జాతీయ, అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేద్దాం

''మన ఊరిలో.. మన వార్డులో మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారు. వారందరినీ గుర్తించి సాన పట్టగలిగితే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయవచ్చు. అలాంటి వారిని గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా..' అనే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది'' – సీఎం జగన్

ఇకపై ఏటా 'ఆడుదాం ఆంధ్ర': సీఎం జగన్



మహిళా క్రికెట్ విభాగంలో విజేతగా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా సిద్ధార్థ నగర్ సచివాలయ జట్టుకు రూ.5 లక్షల చెక్కు, కప్‌ను అందించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సచివాలయ స్థాయి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ, ఆటలపై మక్కువ పెంచేందుకు 'ఆడుదాం ఆంధ్రా..' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25.45 లక్షల మంది క్రీడాకారులు ఇందులో పాలుపంచుకున్నారని, ఈ కార్యక్రమాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. 47 రోజుల పాటు ఉత్సాహభరితంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు ఉత్సవాలు మంగళవారం విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి జగన్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఆరోగ్యం, వ్యాయామంపై అవగాహన పెంచేలా..

మన ఆరోగ్యానికి వ్యాయామం, క్రీడలు ఎంత అవసరం అనే అంశంపై రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో అవగాహన పెరగాలి. ఆడుదాం ఆంధ్రా ద్వారా ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన పెరగాలన్నది ఒక ఉద్దేశమైతే గ్రామ స్థాయి నుంచి మట్టిలోని మాణిక్యాల్ని గుర్తించి వారి ప్రతిభకు సాన పెట్టి శిక్షణ ఇవ్వడం మరో లక్ష్యం. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన యువత రాణించేలా ప్రోత్సహించవచ్చు.

తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ది బెస్ట్..

క్రికెట్‌లో ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెమ్మలను టాలెంటెడ్ ప్లేయర్స్‌గా గుర్తించాం. కబడ్డీలో ముగ్గురు తమ్ముళ్లు, ఒక చెల్లెమ్మను గుర్తించాం. వాలీబాల్‌లో ఒక తమ్ముడు, ఒక చెల్లెమ్మ ప్రతిభను చాటుకున్నారు. ఖోఖోలో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభను గుర్తించాం. బ్యాడ్మింటన్‌లో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభ నిరూపించుకున్నారు. వారికి సరైన శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తూ అడుగులు వేస్తున్నాం. ఎంపికైన తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ద బెస్ట్.

రిలయన్స్, బిర్లా భారీ పెట్టుబడులు

- నేడు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ.1,700 కోట్లతో ఆదిత్య బిర్లా కార్బన్ బ్లాక్ మాన్యుఫ్యాక్చర్ ఫెసిలిటీ
- రూ.1,024 కోట్లతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు
- పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభం
- మొత్తం 10 కంపెనీలు.. రూ.4,883 కోట్ల పెట్టుబడులు
- 4,046 మందికి ఉద్యోగాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు శ్రీకారం చుడుతున్నారు. రిలయన్స్ బయో ఎనర్జీ, ఆదిత్య బిర్లా గ్రూప్‌తోపాటు పలు సంస్థలు రాష్ట్రంలో నెలకొల్పుతున్న పరిశ్రమలకు ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.4,178 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటవుతున్న పలు పరిశ్రమలకు భూమి పూజ నిర్వహించనున్నారు. ఇవి కాకుండా రూ.655 కోట్లతో నెలకొల్పిన ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. మొత్తంగా సుమారు రూ.4,833 కోట్ల పెట్టుబడులు రానుండగా కొత్తగా 4,046 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

తొలుత 8 చోట్ల రిలయన్స్ ప్లాంట్లు

రిలయన్స్ బయో ఎనర్జీ రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. మొత్తం రూ.1,024 కోట్ల పెట్టుబడితో తొలి దశలో కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, నెల్లూరులో బయో గ్యాస్ ప్లాంట్లను నెలకొల్పనుంది. తద్వారా 576 మందికి ఉద్యోగావ అవకాశాలు లభించనున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.1,700 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా నాయుడుపేటలో మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ కార్బన్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వీటితో పాటు హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్, అన ఒలియో ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పలు ప్రాజెక్టులకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపనలతో పాటు పలు యూనిట్లను ప్రారంభిస్తారు.

ఓటర్ల జాబితాలపై 'సుప్రీం' సంతృప్తి

- ఎన్నికల సంఘం చర్యలు భేష్ అన్న సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం
- తాజా ఆదేశాలతో ఎల్లో మీడియా తుప్పు వదిల్చిన సుప్రీం కోర్టు

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులపై నిత్యం అడ్డగోలు ఆరోపణలు చేస్తూ నానా యాగీ చేస్తున్న ఎల్లో మీడియా నోళ్లు మూయిస్తూ సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఓటర్ల జాబితాల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీసుకుంటున్న చర్యలపై సుప్రీంకోర్టు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం చర్యలు సంతృప్తికరంగా ఉన్నందున ఈ వ్యవహారంలో తదుపరి తమ నుంచి ఎలాంటి ఆదేశాలు అవసరం లేదని తేల్చి చెప్పింది. ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు మారిన ఓటర్లు లేదా మరణించిన ఓటర్లు లేదా డూప్లికేట్‌గా నమోదైన ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే విషయంలో చట్ట నిబంధనల మేరకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం లిఖితపూర్వకంగా సమర్పించిన వివరాలు సంతృప్తికరంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు, ఓటర్ల జాబితా సవరణ, తుది ఓటర్ల జాబితా తయారీ వరకు మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకతతో చేపడుతున్నామన్న సీఈసీ వాదనతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముందు చట్ట ప్రకారం వారికి నోటీసు ఇచ్చి వారి వివరణ తీసుకున్న తరువాతే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూడా ఎన్నికల సంఘం చెప్పిన అంశాన్ని సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల సంఘం పారదర్శకంగా అన్ని చర్యలు తీసుకుంటున్నప్పుడు ఇక తదుపరి ఆదేశాలతో పనేముందని విచారణ సందర్భంగా పిటిషనర్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేసిందని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో తమ ముందున్న వ్యాజ్యంతో తదుపరి విచారణ అవసరం లేదంది. ఓటర్ల జాబితా విషయంలో అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ప్రతివాదులుగా చేర్చడంతో పాటు కేంద్ర ఎన్నిక సంఘం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తూ 'సన్సద్ బాచావో ట్రస్ట్' దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధనుంజయ్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన విస్తృత ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎల్లో మీడియా నిత్య రాద్ధాంతం

రాష్ట్రంలో ఓటర్ల జాబితాల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగిపోతున్నాయని, టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఇతర నేతలు చేసిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదంటూ ప్రతిరోజూ ఎల్లో మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాలు వండివారుస్తోంది. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందన్న ఆందోళనను ప్రజల్లో కలిగించేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. కొంతకాలంగా ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని అసత్యాలను ప్రచారం చేస్తోంది. ఎన్నికల అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడానికి కూడా ఏ మాత్రం వెనుకాడటం లేదు. ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తోంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీలో స్వచ్ఛత లేదని నమ్మించే ప్రయత్నం చేస్తోంది. అడ్డగోలుగా ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా ఉత్తర్వులు ఎల్లో మీడియాకు గట్టిగానే షాకిచ్చేవిగా ఉన్నాయి.

సన్సద్ బచావో ట్రస్ట్ పిటిషన్‌పై విచారణ

రాజ్యాంగంలోని అధికరణ 324 ప్రకారం సవరణ ఓటర్ల జాబితాలను తయారు చేసేలా ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించాలని, అలాగే చిరునామా మారిన, మరణించిన, డూప్లికేట్‌గా నమోదైన ఓటర్ల విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం వ్యవహరించేలా కూడా ఆదేశాలు ఇవ్వాలంటూ సన్సద్ బాచావో ట్రస్ట్ 2023లో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని విస్తృత ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆరోరా వాదనలు వినిపిస్తూ.. డూప్లికేట్ ఓటర్ల విషయంలో ఎన్నికల అధికారులు సరిగ్గా స్పందించడం లేదన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అమిత్ శర్మ స్పందిస్తూ.. డూప్లికేట్ ఓటర్లతో సహా ఓటర్ల జాబితా విషయంలో తాము తీసుకుంటున్న అన్ని చర్యలనూ వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'చట్టానికి లోబడే చేస్తున్నాం'

ఈ నేపథ్యంలో అమిత్ శర్మ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ సమగ్ర కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఓ నోట్ కూడా ధర్మాసనం ముందుంచారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చినప్పుడు సుప్రీం కోర్టు ధర్మాసనం ఆ నోట్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. చిరునామాలు మారడం, మరణించడం, భౌగోళికంగా ఒకే ప్రాంతంలో ఓటర్లుగా నమోదు కావడం వంటి విషయాల్లో తీసుకుంటున్న చర్యలను ఎన్నికల సంఘం తన కౌంటర్‌లో వివరించింది. చట్టానికి లోబడి తాము చేస్తున్న పనులన్నింటినీ కోర్టుకు తెలియచేసింది. ఓటర్ల జాబితా నుంచి ఎవరి పేరైనా తొలగించదలచుకుంటే వారికి నోటీసులు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించి ఆ తరువాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకుంటున్న విషయాన్ని సవివరంగా అత్యున్నత న్యాయస్థానానికి నివేదించింది. ప్రతి దశలో ఏం చేస్తున్నాయో తెలియజేసింది. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్న విషయాన్ని కూడా చెప్పింది. లోపాలన్నింటినీ సవరించిన తరువాతే తుది జాబితాను ప్రకటిస్తున్నామని స్పష్టం చేసింది.

ఉన్నత విద్యలో మరో చరిత్ర

ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్ కోర్సులు

సాక్షి, అమరావతి: విద్యా రంగ సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా మరో కీలక అడుగు వేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి లాంటి అత్యుత్తమ వర్సిటీలు అందించే కోర్సులను విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా వీటిని అందుబాటులోకి తెస్తోంది. ఈమేరకు ఇప్పటికే ప్రఖ్యాత మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. పాఠ్యప్రణాళిక కోర్సుల్లో విద్యార్థి తనకు నచ్చిన వర్టికల్‌ను చదువుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 16వ తేదీ నుంచి వర్సిటీల్లో ఎడెక్స్ కోర్సులను సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది.ఎడెక్స్ ప్రపంచంలోనే ప్రముఖ ఈ-లెర్నింగ్ ప్లాట్ ఫారమ్‌గా పేరొందింది. ఒక్కో కోర్సు చేయాలంటే సుమారు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖరీదైన కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం 12 లక్షల మందికిపైగా విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా అందిస్తోంది.

కురుమూర్తి ఆలయ హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం సమీపంలో ఉన్న కురుమూర్తిస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. రెండునెలలకుగాను రూ.13,05,790 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది మదన్‌కుమార్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడుకు నీటి సరఫరా నిలిపివేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని మంగళవారం నిలిపివేశారు. ప్రస్తుతం జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 1,018 అడుగులు ఉందని.. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ఐటీడీఏ పీఓను కలిసిన చెంచు నాయకులు



మన్ననూర్: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)కు ఇన్‌చార్జ్ పీఓగా నియమితులైన డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డిని మంగళవారం కొల్లాపూర్‌లోని ఎల్లూరు వీటీడీఏ అధ్యక్షుడు నిమ్మల శివ, అమరగిరి వీటీడీఏ అధ్యక్షుడు బర్మల మల్లేష్ మంగళవారం అటవీశాఖ కార్యాలయంలో కలిసి శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్ రేంజ్‌లో అటవీ సిబ్బంది కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాలను వివరించారు. గతంలో కొంతమందికి పోడు పట్టాలు ఇచ్చినప్పటికీ.. దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న కొందరికి పట్టాలు లేవని, ఆటంకాలు కల్పిస్తున్నారని వివరించారు. పక్కా ఇళ్లు లేక ఆదివాసి చెంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్పందించిన ఆయన త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేడు జోగుళాంబ నిజరూప దర్శనం



విద్యుత్ వెలుగులతో జోగుళాంబ ఆలయం

- ముగియనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- 40 వేల మంది భక్తులు రావొచ్చని అంచనా
- ప్రత్యేక క్యూ లైన్లు, భోజన సౌకర్యాలు, మౌలిక సదుపాయలు సిద్ధం చేసిన అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. చివరి రోజు జోగుళాంబ దేవి భక్తజనకోటికి నిజరూప దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 40 వేల మంది భక్తులు రావొచ్చని దేవస్థానం వారు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం భక్తులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చలువపందిళ్లు, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. వీఐపీలకు, సామాన్య భక్తులకు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా కలశాలను ధరించి ఊరేగింపుగా వచ్చే భక్తులకు కూడా ప్రత్యేక క్యూ లైన్లు కల్పిస్తున్నారు. ఆలయంలో భక్తుల రాకకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాగా ఏర్పాట్లపై ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు వాటిని పరిశీలించారు.

కార్యక్రమాలు ఇలా...

బుధవారం ఉదయం 8 గంటలకు యాగశాలలో అయిదు రోజులుగా కొనసాగుతున్న ఆవాహిత దేవతా హోమాలకు పూర్ణాహుతి సమర్పిస్తారు. ఇదే సమయంలో గంటల శివాలయంలో జోగుళాంబ సేవాసమితి ఆధ్వర్యంలో జోగుళాంబ జాతర ప్రారంభం కానుంది. అమ్మవారికి సారె తీసుకొచ్చి సమర్పిస్తారు. అదే విధంగా మహాకలశ ఉద్వాసన, అనంతరం సహస్ర గటాలతో ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలు చేస్తారు. అమ్మవారి అభిషేక దివ్య దర్శనం భక్తులకు అనుమతి ఉంటుంది. అభిషేక దర్శన భాగ్యాన్ని భక్తులు నిజరూప దర్శనంగా భావిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 దాకా ఈ నిజరూప దర్శనం ఉంటుంది. గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాల వారు సైతం కలశాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకాలకు సమర్పన చేస్తారు. మధ్యాహ్నం అమ్మవారికి అభిషేక అనంతరం అలంకారం, భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయి. సాయంత్రం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం ఉంటుంది. చివరిగా ఆలయంలో దశవిదహారతి అనంతరం ధ్వజా అవరోహణ కార్యక్రమం ఉంటుంది. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానాలు ఏర్పాటు చేశారు.

■ నిజరూప దర్శనం కోసం అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణం అంతా పచ్చదనాన్ని నింపేందుకు అరటి చెట్లు తోరణాలు సిద్ధం చేశారు. క్యూ లైన్‌లో తాగునీరు, ఉచిత ప్రసాదాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు.

42 మందితో పోలీస్ బందోబస్తు



జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఏడురుగురు ఏఎస్‌ఐలు మరియు హెడ్ కానిస్టేబుల్, 21 మంది పోలీస్ కానిస్టేబుల్స్, ఐదుగురు ఉమెన్ పోలీసులు, ఆరుగురు హోంగార్డులు ఇలా మొత్తం 42 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.
– నాగరాజు, ఎస్‌ఐ అలంపూర్

ప్రశాంతమైన దర్శనం ఉంటుంది



నిజరూప దర్శనం సందర్భంగా భక్తులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. ప్రతిఒక్కరికీ ప్రశాంతమైన దర్శనం ఉంటుంది. భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని అవసరమైతే మరో గంట అధికమైనా పొడిగిస్తాం. దేవస్థానం వారికి భక్తులు సహకరిస్తూ.. పెద్దఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలి. అన్నదానాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.
– పురేందర్‌కుమార్, ఈఓ

అభిషేక ద్రవ్యాలు తీసుకురండి..



అమ్మవారి నిజరూప దర్శనం సందర్భంగా దర్శనార్థం వచ్చే భక్తులు అభిషేకానికి కావాల్సిన పాలు, పంచామృతాలు లేదా, పళ్ల రసాలు, చెరుకు రసాలు, లేదా, మంచినీరు, పూలు, పండ్లు ఏది వీలైతే అది తీసుకురండి. అమ్మవారికి భక్తితో సమర్పించండి. ఇలాంటి నిజరూప దర్శనం ఏడాదిలో ఒకరోజు మాత్రమే ఉంటుంది. భక్తులు పెద్దఎత్తున రావాలి. – ఆనంద్ శర్మ, ప్రధాన అర్చకులు

కనులపండువలా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం కనుల పండువలా సాగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణాలతో గ్రామ కాళ్లమంటపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు సంప్రదాయబద్ధంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు. భక్తుల చెన్నకేశవ, గోవింద నామస్మరణ మధ్య మంటపం నుంచి ఆలయం వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ కట్ట వద్ద వాటిని ప్రతిష్ఠించి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ తరపున కార్య నిర్వహణాధికారి దీప్తి పట్టువస్త్రాలు సమర్పించగా.. పలువురు భక్తులు సైతం కల్యాణోత్సవానికి వస్త్రాలు తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కృష్ణా నుంచి విజయ సంకల్పయాత్ర

- 20వ తేదీన ప్రారంభమై మార్చి 1న నల్గొండలో ముగింపు
- 11 రోజులు.. 21 అసెంబ్లీ నియోజకవర్గాలు...
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

పాలమూరు: బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అయిదు విజయ సంకల్పయాత్రలు నిర్వహిస్తున్నామని.. ఇందులో ఒక యాత్ర ఈ నెల 20న నారాయణపేట జిల్లా కృష్ణా వద్ద ప్రారంభిస్తామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రారంభం కానున్న ఈ యాత్ర మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ పార్లమెంట్ స్థానాల్లోని 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతుందన్నారు. 20న ప్రారంభమై మార్చి 1న నల్గొండలో ముగుస్తుందని.. 11 రోజుల పాటు సాగే యాత్రలో రోజు రెండు నియోజకవర్గాలు తిరిగేలా ప్రణాళిక రూపొందించామని, ప్రతి నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఉండే అన్నివర్గాలను కలుస్తూ సమస్యలు తెలుసుకుంటామని వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అధిక సీట్లు గెలిపించి మూడోసారి మోదీని ప్రధానిని చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, తెలంగాణ ప్రజలను మోసం చేసిన విధానాన్ని ఎండగట్టింది బీజేపీ అయితే.. లబ్ధి పొందింది మాత్రం కాంగ్రెస్‌పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీ హామీలు దాటేవేసే ప్రయత్నం చేస్తోందన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సి ఉండగా.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కృష్ణానదిపై రాజకీయం చేస్తూ ఒకరిపై ఒకరూ పోటీపడుతూ ప్రజల దృష్టిని మరల్చుతున్నారని వివరించారు. జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నందున కృష్ణానది నీటి వాటాను పూర్తిగా వినియోగించుకొని ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఒక్క నియోజకవర్గానికి సీఎంగా వ్యవహరించకుండా ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, శ్రుతి, శ్రీనివాస్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, నాగూరావు నామాజీ తదితరులు పాల్గొన్నారు.

రామన్న హత్యపై సమగ్ర విచారణ జరపాలి

కొల్లాపూర్: ఇటీవల హైదరాబాద్‌లో దారుణహత్యకు గురైన బీజేపీ నాయకుడు పుట్ట రాము అలియాస్ సింగోటం రామన్న హత్యపై సమగ్ర విచారణ జరపాలని మాజీమంత్రి, బీజేపీ జాతీయ నాయకుడు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సింగోటం గ్రామానికి వచ్చి రామన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. చిన్న వయస్సులోనే ప్రజాభిమానాన్ని చూరగొన్న వ్యక్తి రామన్న అని.. ఆయన సంపాదనంతా ప్రజల కోసమే ఖర్చు చేశారని చెప్పారు. పేదలకు ఇళ్లు నిర్మించడం, వారి పిల్లల చదువులు, వైద్యం, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సాయం అందించారన్నారు. రామన్న హత్యపై లోతైన విచారణ జరపాలని కోరారు. కొల్లాపూర్‌లో బీజేపీ బలోపేతానికి రామన్న చేసిన కృషి మరువలేనిదన్నారు.



రామన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఈటల రాజేందర్, ఎల్లేని సుధాకర్‌రావు

ఈటల వెంట జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, నాయకులు శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, జలాల్ శివుడు, కృష్ణ, మహేష్ తదితరులు ఉన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పుణెలో మంగళవారం నుంచి ప్రారంభమైన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఐదు మంది జిల్లా మాస్టర్స్ క్రీడాకారులు ఆయా కేటగిరీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో మహబూబ్‌నగర్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ 55+ ఏళ్ల విభాగంలో హ్యామర్‌త్రో, ప్రధాన కార్యదర్శి పరశురాం 50+ ఏళ్ల విభాగంలో షాట్‌పుట్, దేవదానం 75+ ఏళ్ల విభాగంలో 5 కి.మీ., షాట్‌పుట్, 100 మీటర్ల పరుగు, ఆంజనేయులుగౌడ్ 60+ విభాగంలో షాట్‌పుట్, హ్యామర్‌త్రో, లాంగ్‌జంప్, కృష్ణయ్య 60+ విభాగంలో 100 మీ., 200 మీటర్ల పరుగుతోపాటు లాంగ్‌జంప్ అంశాల్లో పోటీపడుతున్నారు.